అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం

- పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది
- బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు
- సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

పరకాల: నేడు జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పరకాల నియోజకవర్గంలో 2లక్షల 21436మంది మొత్తం ఓటర్లు ఉండగా.. అందులో పురుషులు 1లక్ష 8277మంది, మహిళలు 1లక్ష 13154 మంది, ఇతరులు ఇద్దరు ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్ ప్రక్రియలో భాగంగా పరకాల, ఆత్మకూరు, దామెర, నడికూడ, సంగెం, గీసుగొండ మండలాల్లో 239 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఒక పీఓ, ఒక ఏపీఓ, ఇద్దరు పీఓపీ అధికారులతో పాటు ఒక బీఎల్ఓ, ఇద్దరు సీసీ కెమెరాల అబ్జర్వర్‌తో మొత్తం 1,673 మంది పోలింగ్ సిబ్బంది విధుల్లో పాల్గొననున్నట్లు పరకాల నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. నియోజకవర్గంలో 44 సమస్యాత్మక ప్రాంతాలు ఉండగా, 220 మంది కేంద్ర బలగాలు, 444 మంది పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈవీఎంలతో బయలుదేరిన ఎన్నికల సిబ్బంది బుధవారం సాయంత్రం పోలింగ్ బూత్‌ల వద్దకు చేరుకున్నారు.

నేడు అసెంబ్లీ ఎన్నికల పోలింగ్

కమలాపూర్: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మండలంలో 26,238 మంది పురుషులు, 27,592 మంది మహిళా ఓటర్లు కలుపుకొని మొత్తం 53,830 మంది ఓటర్లు ఉన్నారు. మండల వ్యాప్తంగా 65 పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. మండలంలోని శ్రీరాములపల్లి ఎంపీయూపీఎస్‌లో (226), కమలాపూర్ బాలుర ఉన్నత పాఠశాల (268) పోలింగ్ కేంద్రాల్లో మహిళా పోలింగ్ కేంద్రాలను, కమలాపూర్ బాలుర ఉన్నత పాఠశాలలోని (265) పోలింగ్ కేంద్రంలో మోడల్ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా కాజీపేట ఏసీపీ డేవిడ్ రాజ్ ఆధ్వర్యంలో ఇద్దరు సీఐలు, ముగ్గురు ఎస్సైలు, ఇద్దరు ప్రొహిబిషన్ ఎస్సైలు, 44 మంది బీఎస్ఎఫ్, 42 మంది స్థానిక పోలీసు సిబ్బంది, 41 మంది ఒడిశా రాష్ట్ర బలగాలను దింపి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాటు చేసినట్లు పోలీస్ అధికారులు వెల్లడించారు. బందోబస్తులో మొత్తం 134 మంది పోలీసులు విధులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం పోలింగ్ సామాగ్రితో ఎన్నికల సిబ్బంది ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు.

పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

ఐనవోలు: నేడు జరగనున్న తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికల పోలింగ్‌కు అధికారులు సర్వం సిద్ధం చేశారు. (107) వర్ధన్నపేట శాసనసభ నియోజకవర్గ పరిధిలో మండలంలో 35 బూత్‌లు ఉండగా ప్రతి బూత్‌కు ప్రిసైడింగ్ ఆఫీసర్, ఏపీఓ, ఇద్దరు సపోర్టింగ్ స్టాఫ్, కానిస్టేబుళ్లు ఎన్నికల సామాగ్రితో మంగళవారం సాయంత్రం పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందని ప్రతిఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని అధికారులు సూచించారు. (107) వర్ధన్నపేట శాసనసభ నియోజకవర్గ పరిధిలో మండల వ్యాప్తంగా 35 బూత్‌లు ఉండగా 30,062 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. అందులో పురుషులు 14,833, మహిళలు 15,228 ఇతరులు ఒక్కరు ఉన్నారు. అదే విధంగా (99) స్టేషన్ ఘన్‌పూర్ శాసనసభ నియోజకవర్గ పరిధిలో మండలంలోని గర్మిళ్లపల్లి, వెంకటాపూర్ గ్రామాలు ఉండగా అక్కడ 6 బూత్‌లు ఏర్పాటు చేశారు. అందులో 5,725 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. అందులో 2,807 పురుషులు, 2918 మంది మహిళ ఓటర్లు ఉన్నారు.

పోలింగ్‌కు ముమ్మర ఏర్పాట్లు

ఆత్మకూరు : అసెంబ్లీ ఎన్నికలపోలింగ్‌కు మండల వ్యాప్తంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ సురేష్‌కుమార్ తెలిపారు. మండలంలో 32 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో 27,921 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. పోలింగ్ ప్రశాంతంగా జరగడానికి ప్రతిఒక్కరూ సహకరించాలని సీఐ రవిరాజు కోరారు. పోలింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్ తీసుకెళ్లవద్దని కోరారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

శాయంపేట : నేడు జరగనున్న సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు అధికారులు సర్వం సిద్ధం చేశారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సిబ్బంది బ్యాలెట్ బాక్సులతో బుధవారం చేరుకున్నారు. పోలింగ్ కేంద్రాల్లో సీఐ మల్లేష్, ఎస్సై దేవేందర్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అధికారులు పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ దీపాలు, టెంట్, పోలింగ్ సిబ్బందికి భోజన వసతి కల్పించారు.

మోడల్ పోలింగ్ కేంద్రం ఏర్పాటు

దామెర: మండల కేంద్రంలోని 118 పోలింగ్ కేంద్రాన్ని మోడల్ పోలింగ్ కేంద్రంగా ఏర్పాటు చేశారు. పోలింగ్ స్టేషన్‌ను పూలు, బెలూన్లతో అందంగా తీర్చిదిద్దారు. ఓటేసేందుకు పోలింగ్ కేంద్రానికి వచ్చే ఓటర్లకు పుష్పాలు అందజేసి స్వాగతం పలికి నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకునే విధంగా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు వెల్లడించారు. అయితే పోలింగ్ స్టేషన్‌లో విధులు నిర్వర్తించే వారందరూ మహిళలవడం విశేషం.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా కృషి చేయాలి

సంగెం : ప్రజలు తమ ఓటు హక్కును ప్రశాంతమైన వాతావరణంలో వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రత నిర్వహించాలని సీఐ మల్లయ్య, సంగెం ఎస్సై ఎం.భరత్ సూచించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఎన్నికల బందోబస్తుకు వచ్చిన సిబ్బందికి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా జరిగేందుకు బందోబస్తు నిర్వహించే సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికల నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. ఓటర్లకు డబ్బు, మద్యం ఇతరాలు పంచితే వెంటనే సీ-విజిల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని లేదా డయల్-100కు సమాచారం అందించాలన్నారు. మండలంలో 44 పోలింగ్ కేంద్రాల పరిధిలో 40,224 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. భద్రత కోసం సీఐ, ఇద్దరు ఎస్సైలతో పాటుగా 32 మంది బీఎస్ఎఫ్, 30 మంది ఒరిస్సా మిగిలిన వారు స్థానిక, బెటాలియన్ సిబ్బంది బందోబస్తులో పాల్గొంటున్నారన్నారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు అందరు సహకరించాలని కోరారు.

పోలింగ్ కేంద్రాలకు చేరిన ఈవీఎంలు

మండలంలో 30 లోకేషన్లలో 16 సింగిల్, 14 రెండు చొప్పున పోలింగ్ బూత్‌లున్నాయి. వీటిలో 176 మంది పోలింగ్ సిబ్బంది ఈవీఎంలతో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. బుధవారం సాయంత్రం పోలింగ్‌కు అవసరమైన ఏర్పాట్లు పీఓ, ఏపీఓ ఇతర సిబ్బంది పూర్తి చేసుకున్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా పోలీస్‌లు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఆత్మకూరు : పోలింగ్ కేంద్రానికి చేరుకున్న పోలింగ్ సిబ్బంది, పోలీసులు



ఐనవోలు : పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది



కమలాపూర్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం



సంగెం మండల కేంద్రానికి చేరుకున్న సిబ్బంది



సంగెం : ఎన్నికల విధులపై పోలీస్‌స్టేషన్‌లో అవగాహన కల్పిస్తున్న సీఐ మల్లయ్య



శాయంపేట : సిబ్బందికి సూచనలు చేస్తున్న సీఐ



పరకాల : పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది



దామెర : పూలు, బెలూన్లతో అలంకరించిన మోడల్ పోలింగ్ స్టేషన్

క్లుప్తంగా

నిజాయితీకి మద్దతు

దుగ్గొండి : శాసనసభ ఎన్నికల్లో భాగంగా నియోజకవర్గ వ్యాప్తంగా గురువారం ఎన్నికలు జరగనున్నాయి. 283 పోలింగ్ బూత్‌లు ఉండగా దుగ్గొండి మండలం మైసంపల్లి గ్రామపరిధిలో 1వ నంబర్ బూత్ ఉంది. అందులో తొలిఓటరుగా మిట్టపల్లి గణపతి పేరు నమోదయ్యింది. నియోజకవర్గంలో తొలి ఓటరుగా ఓటు హక్కును గణపతి వినియోగించుకోనున్నాడు. గణపతి బీటెక్ పూర్తి చేసి ఆరు నెలల పాటుగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. తొలిఓటరు తన పేరు నమోదు కావడం చాలా సంతోషంగా ఉందన్నాడు. నూతన ఓటరుగా విద్యావంతుడిగా తాను తెలంగాణ సమగ్రాభివృద్ధితో పాటు నిరుపేదల సంక్షేమం, యువతకు ఉపాధి, ఉద్యోగాలు, నీతి, నిజాయితీగల అభ్యర్థులకు మద్దతు పలుకుతానన్నారు. తొలిఓటరుగా తాను ఓటు వినియోగించుకుంటున్న తరుణం ఎంతో సంతోషాన్ని ఇస్తుందన్నారు. ఓటు వజ్రాయుధమని దానిని ప్రలోభాలకు, డబ్బులకు, ఒత్తిళ్లకు తలొగ్గకుండా సమాజంలోని ప్రతి వ్యక్తి నిజాయితీగా, నిర్భయంగా ఓటు వేయాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

తరలిన ఎన్నికల సిబ్బంది



ఖిలా వరంగల్: పోలింగ్ కేంద్రాలకు ఈవీఎం, వీవీ ప్యాడ్‌లు, ఎన్నికల సిబ్బందిని తరలించారు. వరంగల్ జిల్లాలోని నియోజకవర్గాల వారీగా వాహనాల కేటాయింపు ప్రక్రియ పూర్తి చేసినట్లు వరంగల్ రవాణాశాఖ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కోల రవీందర్ తెలిపారు. గురువారం జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కలెక్టర్ ప్రావీణ్య ఆదేశాల మేరకు వరంగల్ మార్కెట్ యార్డ్‌లో వరంగల్ ఆర్టీఓ అఫ్రిన్ సిద్దిఖీ ఆధ్వర్యంలో ప్రైవేట్ విద్యాసంస్థల బస్సుల ఓనర్స్ అసోసియేషన్ సహకారంతో బుధవారం ఏర్పాటు చేసిన వాహనాలను నియోజకవర్గాల వారీగా కేటాయించినట్లు రవీందర్ వివరించారు. జిల్లాలో నియోజకవర్గాల వారీగా వర్ధన్నపేటకు 79 వాహనాలు, తూర్పునకు 85, నర్సంపేటకు 90 చొప్పున మొత్తం 254 వాహనాలను కేటాయించినట్లు పేర్కొన్నారు. ఆ వాహనాల నిర్వహణను ఎంవీఐ, ఏఎంవీఐ, కానిస్టేబుళ్లు పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు రమేష్‌రాథోడ్, శాలిని, కానిస్టేబుళ్లు, హోంగార్డ్స్, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది



వరంగల్: ఏనుమాముల డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి పోలింగ్ సామగ్రిని తీసుకున్న సిబ్బంది.. తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలను బుధవారం తరలివెళ్లారు. పోలీస్ బందోబస్తుతో పోలింగ్ కేంద్రాలకు ఈవీఎం, వీవీ ప్యాట్‌లను ఎన్నికల అధికారులు చేరవేశారు. వరంగల్ తూర్పు, పశ్చిమ, వర్ధన్నపేట, నర్సంపేట, పరకాల నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాలకు సామగ్రిని, ఈవీఎంలను తరలించినట్లు వారు వివరించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. అధికారుల సూచనలు పాటించాలన్నారు.

పోలీసుల బందోబస్తు



మడికొండ: గురువారం జరగనున్న ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 46, 64వ డివిజన్లలోని 24 బూత్‌ల్లో ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నారు. పోలింగ్ కేంద్రాలకు పోలీసు సిబ్బంది తరలివెళ్లినట్లు మడికొండ ఇన్‌స్పెక్టర్ వేణు తెలిపారు. ఎన్నికల్లో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ప్రజలు కూడా తమకు సహకరించాలని కోరారు.

ఓటర్లకు డబ్బులు పంచిన నేతలు

మంగపేట: మండలంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఓట్ల కోసం బుధవారం ఓటర్ల ఇంటింటికి తిరిగి డబ్బులను పంచారు. ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు ఓక్కో ఓటుకు కొంత చొప్పున 100 మంది ఓటర్లకు ఒక్కొక్కరికి బాధ్యతలు అప్పగించి ఓటర్ స్లిప్పుతో పాటు డబ్బులు పంపిణీ చేసినట్లు బహిరంగ ప్రచారం జరిగింది. ఇదిలా ఉండగా వివిధ గ్రామాల్లో కొందరు నాయకులు వారికి అనుకూలమైన వారి ఇంటికి వెళ్లి డబ్బులు ఇచ్చి పక్కింటి వారికి డబ్బులు ఇవ్వకుండా వెళ్లడంతో ఓటర్లు తాము ఓటర్లం కాదా తమకెందుకు ఇవ్వడం లేదని ఆందోళనకు దిగారు. కొందరు నేతలు పలు యూనియన్ల నాయకుల ఆధ్వర్యంలో ఆయా యూనియన్ల సభ్యులకు విందు ఏర్పాటు చేశారు. ఈ తతంగం మండలంలో హాట్‌టాపిక్‌గా మారింది.

రాజకీయ కక్షతోనే సోదాలు

కమలాపూర్: రాజకీయంగా ఎదుర్కోలేకనే తన ఇంట్లో, డెయిరీ ఫామ్‌లో అధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చి సోదాలు చేయించారని మండలంలోని మాదన్నపేట సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుండవు చరణ్‌పటేల్ ఆరోపించారు. మంగళవారం అర్ధరాత్రి తన ఇంట్లో, డెయిరీ ఫామ్‌లో స్థానిక పోలీసుల సహకారంతో ఎన్నికల సంఘం ప్రత్యేక అధికారులు సోదాలు నిర్వహించారని తెలిపారు. వారికి ఎలాంటి నగదు, ఇతరత్రా వస్తువులు, ఆధారాలు లభించలేదని అన్నారు. గత ఉప ఎన్నికల నుంచి బీఆర్ఎస్, బీజేపీ నాయకులు తనను పార్టీ మారాలని, ఇతరత్రా ప్రలోభాలకు గురి చేస్తున్నారని తెలిపారు. తాను లొంగక పోవడంతో కక్ష పూరితంగా తన ఇంట్లో, డెయిరీ ఫామ్‌లో దాడులు చేయించారని ఆరోపించారు.

ఆడబిడ్డ వివాహానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న శ్రీధర్‌రెడ్డి

దామెర: మండలంలోని ఒగ్లాపూర్ గ్రామానికి చెందిన సిలువేరు రాధ, మల్లయ్య దంపతుల కుమార్తె హిమప్రియ వివాహానికి గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ కేతిపల్లి శ్రీధర్‌రెడ్డి చేయూతనిచ్చారు. పుస్తె మట్టెల కోసం రూ. 10,000 ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం అధ్యక్షురాలు సుజాత, దామెర రజిని, గ్రామస్తులు కిన్నెర రామస్వామి, కీసరి రమేష్, కిన్నెర రమేష్, పోరల సతీష్‌కుమార్, నల్ల శంకర్, కిన్నెర లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లుగా విద్యార్థులు



ఎంపికైన ఉప్పరపల్లి పాఠశాల విద్యార్థులు

చెన్నారావుపేట : నేడు(గురువారం) జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లకు సేవలందించేందుకు విద్యార్థులను వలంటీర్లగా ఎన్నికల కమిషన్ కేటాయించింది. వృద్ధులకు, దివ్యాంగుల ఓటర్లకు తగిన సహాయం చేయడానికి వలంటీర్లను నియమించింది. చెన్నారావుపేట మండలంలోని ఉప్పరపల్లి హైస్కూల్ నుంచి చెలకలపల్లి సిద్దార్థ, ప్రభాస్, నిక్సన్, మురళీకృష్ణలను వలంటీర్లుగా తీసుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. వృద్ధులు, ఇతర అవసరాలు గల ఓటర్ల సహాయార్థం వలంటీర్లుగా పని చేయడం తమ జీవితంలో మర్చిపోలేమని అన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

వర్ధన్నపేట : ఓటు హక్కు కలిగిన వారంతా గురువారం తమ ఓటును విధిగా వినియోగించుకుని సరైన నాయకుడిని ఎన్నుకోవాలని సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు అవగాహన కల్పించారు. బుధవారం మండలంలోని ఇల్లంద గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు భార్గవి, నవ్య తెలంగాణ సంస్కృతిలో భాగమైన రంగవల్లులు వేసి ప్రజలకు చక్కటి సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఓటు అనేది రాజ్యాంగం కల్పించిన హక్కు అని అన్నారు. ఐదేళ్ల కాలానికి ఒక మంచి సమర్థవంతమైన నాయకుడిని ఎన్నుకునేందుకు రాజ్యాంగం అవకాశం కల్పించిందన్నారు. ముఖ్యంగా ఈ సారి 10 లక్షల మంది యువత కొత్తగా ఓటు హక్కు పొందారన్నారు. కార్యక్రమంలో కాలనీకి చెందిన మహిళలు సమ్మక్క, రజిత, రజని, నళిని, విజయ, నర్మద తదితరులు పాల్గొన్నారు.



రంగవల్లులతో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తున్న యువతులు

బెల్ట్‌షాపులపై ఎక్సైజ్ పోలీసుల దాడి



స్వాధీనం చేసుకున్న మద్యం

రాయపర్తి : మండల కేంద్రంలో బెల్ట్‌షాపులపై దాడులు నిర్వహించి మద్యంను స్వాధీనం చేసుకున్నట్లు వర్ధన్నపేట ఎక్సైజ్ ఎస్సై సువర్ణ తెలిపారు. బుధవారం మండలకేంద్రంలో ఎన్నికల నియమావళికి విరుద్ధంగా మద్యం బాటిళ్లను నిల్వ చేయగా సమాచారం మేరకు దాడులు నిర్వహించి వాటిని స్వాధీనం చేసుకోవడంతోపాటు నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

మద్యం ధరలకు రెక్కలు

కొత్తగూడ: ఏజెన్సీ గ్రామాల్లో మద్యం ధరలకు రెక్కలు వచ్చాయి. ఎన్నికల దృష్ట్యా మద్యం షాపులు సీజ్ కావడంతో బెల్టుషాపుల జోరు కొనసాగుతుంది. ఎన్నికల ముందు కొన్నిరోజులు ఎక్సైజ్ అధికారులు బెల్ట్‌షాపులను బంద్ చేయించి చివరకు విచ్చలవిడిగా వదిలేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముందుగానే అంచనా వేసుకున్న బెల్టు షాపుల యజమానులు భారీగా మద్యం బాటిళ్లను డంప్ చేసుకున్నట్లు సమాచారం. షాపులో ఉన్న ధరతో పోలిస్తే రెట్టింపు ధరకు విక్రయిస్తున్నట్లు మద్యం ప్రియులు పేర్కొన్నారు. బెల్టు షాపుల యజమానుల వద్ద ఎక్సైజ్ అధికారులు డబ్బులు తీసుకుని చూసీచూడనట్లు ఉంటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు మద్యం ప్రియులు కోరుతున్నారు.

బీసీ సంక్షేమ సంఘం నాయకుల తప్పుడు ప్రచారం

హన్మకొండ: బీసీలంతా బీఆర్ఎస్‌కు మద్దతు ఇస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలంగాణ దాసరి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కే.సంతోష్, ప్రధాన కార్యదర్శి కే.సత్యనారాయణ తెలిపారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో బీసీలంతా బీఆర్ఎస్ అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్‌కు మద్దతు తెలుపుతున్నట్లు జారీ చేసిన ప్రకటనను వారు ఒక ప్రకటనలో ఖండించారు. బీసీ కులాలందరి అభిప్రాయం తెలుసుకోకుండా బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఎలా వెల్లడిస్తారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ అభ్యర్థితో లోపాయికారి ఒప్పందం చేసుకున్నట్లు తమ కుల సంఘం దృష్టికి వచ్చిందని తెలిపారు. ఆ సంఘాన్ని బీసీ సంక్షేమ సంఘానికి బదులు గౌడ సంఘం అంటే బాగుంటుందని తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. దాసరి కుల సంఘానికి స్థలం, భవన నిర్మాణానికి నిధులు ఇప్పించలేదని, దాసరి కులస్తులపై వివక్ష చూపిన వినయ్‌భాస్కర్‌ను వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. వరంగల్ పశ్చిమ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నాయిని రాజేందర్‌రెడ్డికి తమ మద్దతు తెలుపుతున్న వివరించారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

కేయూ క్యాంపస్: ప్రజాస్వామిక వ్యవస్థలో ఓటు అనేది ఓ వజ్రాయుధం లాంటిదని, దాన్ని ప్రతీ ఓటరు వినియోగించుకోవాలని కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ గాదె సమ్మయ్య బుధవారం తెలిపారు. భారత రాజ్యాంగ కల్పించిన ఓటు హక్కు రాజ్యాంగబద్ధమైందని పేర్కొన్నారు. ఈక్రమంలో ఓటును సద్వినియోగం చేసుకుని రాజ్యాంగాన్ని పరిరక్షించాలని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు అందరూ ఓటు వేయాలని కోరారు.

కొనసాగుతున్న మహా అన్నదానం

నర్సంపేట : నర్సంపేట పట్టణంలోని శ్రీధర్మశాస్తా అయ్యప్పస్వామి ఆలయంలో ఆలయ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్‌గుప్తా ఆధ్వర్యంలో 23వ మండల పూజా మహోత్సవం బుధవారం 14వ రోజుకు చేరుకుంది. ఈ మేరకు అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శింగిరికొండ వేణుగోపాల్‌గుప్తా, మేర్గు స్వామి, మామిండ్ల రమేష్, కటకం అజయ్, వాంకుడోత్ రాజేందర్, ఐత సత్తయ్య, అజ్మీరా శంకర్ అయ్యప్ప స్వాములకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాదారపు చంద్రశేఖరం, దొడ్డ రవీందర్, శ్రీరాంతఈశ్వరయ్య, శంకరయ్య, భూపతి రాజశేఖర్, దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దాతలు


ఎయిడ్స్‌ను తరిమికొడదాం



ఎయిడ్స్ ఆకృతిలో కూర్చున్న విద్యార్థులు

నెక్కొండ : ఎయిడ్స్ వ్యాధిని పూర్తిగా నివారించడానికి సమష్టిగా కృషి చేయాలని సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి రేణుక అన్నారు. మండల కేంద్రంలోని విద్యోదయ గురుకుల పాఠశాలలో బుధవారం సంస్థ ఆధ్వర్యంలో డిసెంబర్ 1న నిర్వహించనున్న ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు ఎయిడ్స్ పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఎయిడ్స్ రోగుల పట్ల వివక్ష చూపకూడదని అన్నారు. మందులేని ఎయిడ్స్‌కు నివారణే మార్గమని ఆమె పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చల్లా నాగార్జున్‌రెడ్డి, డైరెక్టర్ చల్లా పారిజాతం, ప్రిన్సిపాల్ మహ్మద్ షరీఫ్, సంస్థ సభ్యులు లక్ష్మి, విజయ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న మోడల్ పోలింగ్ స్టేషన్



పరకాల: కాకతీయ కళాతోరణాలతో ఓటర్లకు స్వాగతం పలుకుతూ పట్టణంలోని మాడారం కాలనీలో మోడల్ పోలింగ్ స్టేషన్ (నెం.36) ఆకట్టుకుంటుంది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో గీసుగొండ జెడ్పీహెచ్ఎస్(160), సంగెం జూనియర్ కళాశాల(215), చర్లపల్లి ప్రాథమిక పాఠశాల(27), ఆత్మకూరు జూనియర్ కళాశాల (104), పరకాల అంబేడ్కర్ భవన్(36)ను మోడల్ పోలింగ్ స్టేషన్‌లుగా గుర్తించి ఓటర్లను ఆకట్టుకునేలా ముస్తాబు చేశారు. అదే విధంగా మహిళ పోలింగ్ స్టేషన్‌లుగా దామెర జెడ్పీహెచ్ఎస్(118), ధర్మారం జెడ్పీహెచ్ఎస్(166), సంగెం ప్రాథమిక పాఠశాల(214), ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల(104), పరకాల ఊర్దు ప్రాథమిక పాఠశాల (50), పీడబ్ల్యూయిడీ పోలింగ్ స్టేషన్‌గా రాయపర్తి(240) యూత్ పోలింగ్ స్టేషన్‌గా ఊరుగొండ జెడ్పీహెచ్ఎస్(110)ను ఎంపిక చేశారు.

డబ్బులు ఇవ్వలేదని ఆందోళన చేసిన ఓటర్లు



ఆందోళన చేస్తున్న ఓటర్లు

ఏటూరునాగారం: ఎన్నికల సందర్భంగా తమకు డబ్బులు ఇవ్వలేదని, మా బంధువులకు ఇచ్చి మా కుటుంబం, మా ఇంటి పక్కల ఇవ్వలేదని కొంతమంది ఓటర్లు ఓటరు స్లిప్స్ చేతపట్టుకొని ఆందోళకు దిగారు. ఈ సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బుధవారం కొన్ని పార్టీల నాయకులు డబ్బులను పంచడం జరిగిందని ఓటర్లు తెలిపారు. తమకు ఓటు హక్కు ఉన్నప్పటికీ కొంత మందికి ఇచ్చి తమకు ఇవ్వకపోవడంతో ఆ పార్టీల నాయకులపై దుమ్మెత్తి పోశారు. కొంత మందికే ఇచ్చి మకు ఎందుకు ఇవ్వడం లేదని నిలదీయడంతో ఆ పార్టీల నాయకులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.